క్లుప్తంగా

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమాల్లో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చేతుల శుభ్రతపై అవగాహన



తిరువూరు: ప్రపంచ గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా తిరువూరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భోజనానికి ముందు, తర్వాత కూడా చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉండదని ఉపాధ్యాయులు వివరించారు. ఆంజనేయపురంలో సర్పంచ్ మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి పాల్గొన్నారు. చౌటపల్లిలో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు.

రుగ్మతలకు చెక్

ముసునూరు: చిన్నచిన్న రుగ్మతలను అంతమొందించాలంటే అందరూ చేతుల శుభ్రతను పాటించాలని ఎంపీడీఓ జి.రాణి పిలుపునిచ్చారు. చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో సభలు, ర్యాలీలు, మానవహారాలతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆమె చేతులను సబ్బుతో శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు.

నూజివీడులో..

నూజివీడు: మండలంలోని బోర్వంచలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కుంటం ఉదయరాజు, డీఎల్పీఓ కార్యాలయ ఏఓ ఎంపీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రామాలయంలో సుదర్శన హోమం

తిరువూరు: స్థానిక శ్రీకోదండ రామాలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. వేదపండితులు రఘుపుంగవాచార్యులు ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్రస్వామికి విశేషపూజలు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా సుదర్శన హోమాన్ని జరిపారు. సుదర్శన మంత్రం పఠిస్తూ భక్తులు హోమంలో పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరీదేవీ నమోస్తుతే



నూజివీడులో శ్రీ కోట మహిషాసురమర్దిని అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



బలివేలో బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి



చనుబండ మెయిన్ రోడ్డులో అమ్మవారికి పూజలు

బలివే (ముసునూరు): బాలా త్రిపురసుందరీ దేవీ నమోస్తుతే, క్షేమ దాయినీ కాపాడు తల్లీ! అంటూ దేవీ నవరాత్రులను పురస్కరించుకుని తొలి రోజున ఆదివారం బలివేలోని చారిత్రక ప్రసిద్ధ రామలింగేశ్వ స్వామి ఆలయానికి ఉప ఆలయంలో కొలువై ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు.

నూజివీడులో..

నూజివీడు: దసరా ఉత్సవాలకు ఆంధ్రా మైసూర్‌గా పేరుగాంచిన నూజివీడులో శ్రీ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలోని శ్రీ కోటమహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజున అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు జీ సత్యనారాయణచార్యులు తొలుత కలశస్థాపన, అఖండ దీపారాధన నిర్వహించి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. శ్రీకోట మహిషాసురమర్దిని అమ్మవారికి తొలిరోజు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య దంపతులు పట్టు వస్త్రాలు, పళ్లు, పూలు, గాజులను సమర్పించారు.

లక్ష కుంకుమార్చన

గంపలగూడెం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గంపలగూడెం గాంధీ సెంటర్లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆదివారం రాత్రి అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు తూకుంట్ల లక్ష్మణశాస్త్రీ, శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 100 మంది మహిళలు కుంకుమార్చన కనులవిందుగా జరిపారు. ప్రతిరోజు రాత్రి ఏడు గంటల నుంచి 10 రోజుల పాటు నిర్వహించే లక్ష కుంకుమార్చనలో మహిళలు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

చాట్రాయిలో..

చాట్రాయి: దసరా సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం దేవి నవరాత్రులు ప్రారంభించారు. కనకదుర్గ అమ్మవారి ప్రతిమలను గ్రామాల్లో ఊరేగించారు. ఉదయం 11 గంటలకు బాలాత్రిపుర సుందరి దేవిగా అవతారంలో ఉన్న అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారు బాలత్రిపు ర సుందరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చా రు. వేద పండితులు పూజలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కొటికలపూడి గ్రామంలో అమ్మవారికి కృష్ణానది జలాలతో అమ్మవారికి అభిషేకం చేసి పసుపు కుంకుమ గాజులతో సారె సమర్పించారు. కిలేశపురంలో బొడ్డు రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి గంగానమ్మకు బోనాలు సమర్పించారు.

తిరువూరులో..

తిరువూరు: దసరా వేడుకలు తిరువూరు మండలంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. తిరువూరులోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీకనకదుర్గాలయం, శ్రీషిర్డిసాయి మందిరం, శ్రీగౌరీకేదారేశ్వరాలయం, ఆర్యవైశ్య కల్యాణమంటపం, జైహింద్‌మిల్ సెంటర్లలో, వామకుంట్ల, పీటీకొత్తూరు రామాలయాలలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని విశేషాలంకారాలతో పూజాదికాలు నిర్వహించారు.

నెమలిలో..

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో దసరా సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. రాజ్యలక్ష్మీ దేవికి ఆదిలక్ష్మీదేవిగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రులను ఆదివారం ప్రారంభమయ్యాయి. రెడ్డిగూడెం రజకుల బజారున దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుట్రేలలో..

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా సందర్భంగా అమ్మవారిని ఆదివారం బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తుల దర్శన భాగ్యం కలిగించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్ కుమార్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



గంపలగూడెం గాంధీసెంటర్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

మైలవరంలో..

మైలవరం: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని మొదటి రోజు ఆదివారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మైలవరంలో శ్రీదుర్గా మోటార్ మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంక్ వద్ద దసరా మహోత్సవ వేడుకలు ప్రారంభించారు. చలువ పందిరి వేసి పూలతో అలంకరించిన వేదికపై అమ్మవారిని ఆశీనులను చేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: దసరా సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి వేడుకలను ఆదివారం ప్రారంభించారు. గంపలగూడెం గాంధీసెంటర్‌లో ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అర్చకులు తూకుంట్ల లక్ష్మణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, సామూహిక లక్ష కుంకుమార్చనలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



నెమలిలో ఆదిలక్ష్మీదేవికి పూజలు



తిరువూరు మండలం వామకుంట్లలో బాలాత్రిపురసుందరీదేవి అలంకారం



కొటికలపూడిలో అమ్మవారికి జల బిందెలు, సారె తీసుకెళుతున్న భక్తులు

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

మైలవరం: మైలవరం గ్రామ సచివాలయం-1 పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణ రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్‌లు, అధికారులు, గృహసారథులు హాజరు కావాలని పేర్కొన్నారు.

గుళ్లపూడిలో..

గుళ్లపూడి(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాంలో భాగంగా సోమవారం గంపలగూడెం మండలం గుళ్లపూడిలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామం సచివాలయం వద్ద నిర్వహించే కార్యక్రమంలో గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీ వైద్యులు, స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్యసేవలు అందజేస్తారని పేర్కొన్నారు.

దేవరగుంటలో..

నూజివీడు: మండలంలోని దేవరగుంటలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తారని పేర్కొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీ శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం-2 పరిధిలో సోమవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని వినతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ కోరారు. ఈ మేరకు ఐతవరంలోని ఆయన నివాసంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి

తిరువూరు: స్థానిక శ్రీనిధి స్కూల్లో దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, డైరెక్టర్ రాజయ్య, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలను శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు రవి, నాగరాజు, లైబ్రేరియన్ శ్రీలత పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం : కలాం అడుగు జాడల్లో నేటి యువత నడవాలని, దేశ అభ్యున్నతికి పాటుపడాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకోవడం అదృష్టంగా భావించుకోవాలని పేర్కొన్నారు.

బతుకమ్మ పూజలకు శ్రీకారం



ఊటుకూరు(గంపలగూడెం): దసరా సందర్భంగా తొమ్మిదిరోజుల పాటు నిర్వహించే బతుకమ్మ పూజలను గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రారంభించారు. ఊటుకూరులో రామిశెట్టి వేణుగోపాలరావు కల్యాణ మండపంలో ఆనవాయితీగా వెంపలిచెట్టును నాటి బతుకమ్మ పూజలను మహిళలు ప్రారంభించారు.

విద్యార్థుల పుస్తక పఠనం

రెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులకు చదవటం, మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దసరా సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చిన పుస్తక పఠనం చేశారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ దుర్గాప్రసాదు ఆదివారం తెలిపారు.

ఆహార అలవాట్లపై నియంత్రణ అవసరం



తిరువూరు: మధుమేహం, రక్తపోటు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లపై నియంత్రణ కలిగి వుండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక నాగార్జున స్కూలు ఆవరణలో ఆదివారం మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రోగులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ ఉ ప్పు, పంచదార, నిల్వ పచ్చళ్లు సాధ్యమైనంతవరకు తగ్గించుకోవాలన్నా రు. తృణ ధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పని వ్యాయామం, నడక మంచి అలవాట్లన్నారు. వైద్యులు రవీంద్ర, మధుకీర్తి, సత్యతేజ, కృపారాణి, లక్ష్మణరావులు 1,100 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇచ్చారు. జేవీవీ సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, పాపారావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నవంబరు 10న చెకుముకి పరీక్ష

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబరు 10వ తేదీన పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాలవాల్ పోస్టరును తిరువూరులో ఆదివారం ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనవచ్చని, వివరాలకు విద్యార్థులు చదువుతున్న పాఠశాల హెచ్‌ఎంలను సంప్రదించాలని కోరారు.